తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
సోమవారం
26 అక్టోబర్ 2026
Follow :


## జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో నిర్లక్ష్యం: మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

• మెరుగైన వసతులు కల్పించాలి



జడ్చర్ల, అక్టోబర్ 25 (జనంసాక్షి): జడ్చర్ల ఏరియా ఆస్పత్రి మార్చురీలో మృతదేహాలు పాడవడం దారుణమని మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యవసర సేవలు అందించే ప్రభుత్వ ఆస్పత్రికి కూడా విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడం వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. బాధిత కుటుంబాలకు మృతదేహాలను గౌరవప్రదంగా అప్పగించాల్సింది పోయి, విద్యుత్ కోతలు, యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా మృతదేహాలు పాడైపోయే పరిస్థితి రావడం హేయమైన చర్య అని మండిపడ్డారు. గతంలో కూడా మృతదేహాలను కుక్కలు పీక్కుతినడం, విద్యుత్ నిలిచిపోవడం వంటి ఘటనలు జరిగినా ఆస్పత్రిలో సేవలు మెరుగు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు, మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## గోపాలపేటలో ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ సెలక్షన్లు

• సోమవారం అండర్-14 జిల్లా ఎంపికలు..
• మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాస్థాయి ఎంపికలు



గోపాలపేట, అక్టోబర్ 25 (జనంసాక్షి): వనపర్తి జిల్లా ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ ఎంపికలకు గోపాలపేట వేదిక కానుంది. గోపాలపేట మండలంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్‌ఎస్ గోపాలపేట క్రీడామైదానంలో సోమవారం అండర్-14 విభాగంలో వనపర్తి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కుమార్ తెలిపారు. అలాగే మంగళవారం ఇదే క్రీడామైదానంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాస్థాయి ఫుట్‌బాల్ సెలక్షన్లు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులు ఈ ఎంపికల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని సూచించారు.

**క్రీడా ప్రతిభకు గోపాలపేట వేదిక...**

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న ఫుట్‌బాల్ ప్రతిభను వెలికితీసేందుకు ఎస్‌జీఎఫ్ నిర్వహిస్తున్న ఎంపికలు ఎంతో ఉపయోగపడతాయని పీఎం శ్రీ జడ్పీహెచ్‌ఎస్ గోపాలపేట ప్రధానోపాధ్యాయులు జిల్లెల్ల సురేందర్ రెడ్డి తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా పాఠశాల తరఫున ప్రోత్సాహం అందిస్తున్నామని పేర్కొన్నారు. వరుసగా రెండు రోజుల పాటు గోపాలపేటలో జరిగే ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ సెలక్షన్లు యువ క్రీడాకారులకు మంచి అవకాశంగా నిలవనున్నాయి.

## ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

• జీహెచ్‌ఎంసీ కార్మికుడిని ఢీకొట్టిన ఆటో ట్రాలీ.. ఇద్దరూ దుర్మరణం
• హైదరాబాద్ నుంచి ముత్తంగి వైపు వెళ్తుండగా ఘటన



రామచంద్రాపురం, అక్టోబర్ 25 (జనంసాక్షి): ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. డివైడర్‌లోని చెట్లకు నీరు పోస్తున్న జీహెచ్‌ఎంసీ కార్మికుడిని ఆటో ట్రాలీ ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కార్మికుడితో పాటు ఆటో నడుపుతున్న వ్యక్తి కూడా మృతి చెందినట్లు తెలిసింది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. జీహెచ్‌ఎంసీ సిబ్బంది వాటర్ ట్యాంకర్ (నంబరు టీ ఎస్ 12 యూ డి 6099)తో ఓఆర్ఆర్ డివైడర్‌లోని చెట్లకు నీరు పోస్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ముత్తంగి వైపు వెళ్తున్న ఆటో ట్రాలీ (నంబరు టీ ఎస్ 07 డబ్ల్యూ 9174) వేగంగా వచ్చి నీరు పోస్తున్న కార్మికుడు శ్రీనివాస్ అలియాస్ వీరు (30)ను ఢీకొట్టినట్లు సమాచారం.

**ప్రమాదంలో ఇద్దరి మృతి...**

ఈ ఘటనలో శ్రీనివాస్‌తో పాటు ఆటో నడుపుతున్న శ్రీనాథ్ (సుమారు 25-30 ఏళ్లు) తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి పరిస్థితులపై పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.



**దర్యాప్తు చేస్తున్న పోలీసులు...**

ప్రమాదానికి గల కారణాలు, వాహనాల వేగం, ఘటన జరిగిన తీరుపై పోలీసులు దర్యాప్తు చేసి, మృతుల పూర్తి వివరాలు, ప్రమాదానికి సంబంధించిన ఇతర అంశాలు తెలుపాల్సి ఉందన్నారు.

## వనపర్తి విద్యాభివృద్ధికి రూ.680 కోట్లు

• మామిడిమడ పాఠశాల అభివృద్ధికి రూ.కోటి కార్పస్ ఫండ్
• పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి): వనపర్తి నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ఇప్పటికే రూ.680 కోట్ల నిధులు తీసుకొచ్చామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఖిల్లా ఘణపురం మండలం మామిడిమడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం, పాదపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

**పాఠశాల అభివృద్ధికి రూ.కోటి...**

మామిడిమడ ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.కోటి కార్పస్ ఫండ్ సమకూర్చనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరగా, పలువురు అక్కడికక్కడే విరాళాలు ప్రకటించారు.





దీంతో సుమారు రూ.20 లక్షలు సమకూరాయి. మొదటి విడతలో మామిడిమడ, ఖిల్లా ఘణపురం, వనపర్తి హరిజనవాడ, పెబ్బేరు ఉన్నత పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు...**

రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందని మేఘారెడ్డి తెలిపారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 పాఠశాలలకు రూ.1,000 కోట్లు కేటాయించగా, నిర్మాణాలకు రూ.793 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పెద్దమందడి మండలం వెల్టూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు.



నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయించి అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, వాటర్ ప్లాంట్లు, టేబుళ్లు వంటి సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. మరో రూ.కోటితో పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు విరాళాలు అందించి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కృషిని అభినందించారు. అనంతరం పాఠశాలలో నూతన గ్రంథాలయం, శుద్ధ నీటి కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధ్యక్షుడు నవనీత శ్యామ రాజు, ప్రధానోపాధ్యాయుడు చెన్నప్ప, ఎంఈఓ జయశంకర్, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా తయారీ అడ్డుకున్న ఎక్సైజ్ అధికారులు... కేసులు నమోదు



శివ్వంపేట, అక్టోబర్ 25 (జనంసాక్షి): మండలంలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న అక్రమ గుడుంబా, మద్యం తయారీ, విక్రయాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. శివ్వంపేట మండలం భీమ్లా తండాలో గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు శనివారం రాత్రి ఆ ప్రదేశానికి చేరుకొని దాడుల్లో గుడుంబా తయారీదారుడిని అరెస్ట్ చేయడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న రెండు బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు రెండు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 30 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అనధికారికంగా ఐఎంఎల్ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో అధికారులు రెండు బెల్ట్ షాపుల్లో తనిఖీలు చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి రెండు కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో 4.32 లీటర్ల ఐఎంఎల్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గుడుంబా తయారీ, అక్రమ మద్యం విక్రయాలు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఇన్స్ పెక్టర్ గులాం ముస్తఫా, ట్రైనీ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జ్ఞానేశ్వర్, ఎస్ఐ శరత్ కుమార్, ట్రైనీ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సచిరథ, ఎక్సైజ్ సిబ్బంది రవి, హెడ్ కానిస్టేబుల్ స్వామి, కానిస్టేబుళ్లు మహేష్ కుమార్, షాహిద్, రాజశేఖర్‌లు ఉన్నారు.

## ప్రతి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

• మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి



అమరచింత, అక్టోబర్ 25 (జనంసాక్షి): ఆదివారం మినీ ఫంక్షన్ హాల్ దగ్గర నిర్వహించిన మక్తల్ నియోజక వర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషిచేస్తుందని మంత్రి వాకి టి శ్రీహరి పేర్కొన్నారు. అమరచింత మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ బంకు దగ్గర మినీ ఫంక్షన్ హాల్లో గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 14 గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మౌలిక వసతుల సమస్యలను గ్రామాల వారీగా గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. సమస్యల పరిష్కారానికి గడువు నిర్ణయించి, అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే నియోజకవర్గం సమగ్రంగా అభివృద్ధి చెందుతుంది అని పేర్కొన్నారు.

## చల్లారం లక్ష్మి పార్థివదేహానికి ఎంపీ రఘునందన్ రావు నివాళులు



**నంగునూరు, అక్టోబర్ 25 (జనంసాక్షి):** నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చల్లారం కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డిల తల్లి చల్లారం లక్ష్మి (82) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు గ్రామంలోని ఆమె నివాసానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. లక్ష్మి అంతిమయాత్ర, అంత్యక్రియల్లో పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, చౌదుచర్ల వెంకట్రాంరెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి అండగా పదో తరగతి మిత్రులు



**తెలకపల్లి, (జనంసాక్షి):** వట్టిపల్లి గ్రామానికి చెందిన జలాల శ్రీనివాస్ కుక్కకాటుతో రేబిస్ వ్యాధి సోకి సెప్టెంబర్ 5న మృతి చెందారు. ఆయన కుటుంబానికి అండగా నిలిచిన 2005–06 పదో తరగతి మిత్రులు, శ్రీనివాస్ భార్య లావణ్యను పరామర్శించారు. ఆయన చిన్న కుమార్తె ఉషారాణి భవిష్యత్తు కోసం రూ.80 వేలతో పోస్టాఫీసులో ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలను కుటుంబానికి అందజేశారు. ఆపదలో స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన మిత్రులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాకం భాస్కర్, జి. రాజు, చెన్న రాయుడు, నరేష్, రాముడు, గణేష్, రాంప్రసాద్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మహా రుద్రాభిషేకం



**అమీన్పూర్, అక్టోబర్ 25(జనంసాక్షి):** ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని మాధవానంద సరస్వతి స్వామి పేర్కొన్నారు. ఆదివారం బీరంగూడ జయలక్ష్మి నగర్ కాలనీలో ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి సహిత శ్రీ కాశీ విశ్వేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ మాధవానంద సరస్వతి స్వామి సమక్షంలో శ్రీ మహా రుద్రాభిషేకం, ఐదు లక్షల పూలతో కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి 130 మంది వేద పండితులతో దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహా రుద్రాభిషేకం, పుష్పార్చన నిర్వహించారు. అనంతరం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు, పటాన్చెరు నరసాపూర్ దుబ్బాక ఎమ్మెల్యేలు మహిపాల్ రెడ్డి, సునీత రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:ఎస్పీ వినీత్

**నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 25(జనంసాక్షి):** ప్రస్తుత సమాజంలో వివిధ రూపాల్లో జరుగుతున్న చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బంగారం, స్థలాలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, లక్కీ డ్రాలు, విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, సులభంగా లోన్, తక్షణ ఉద్యోగం, లాటరీ గెలుపు వంటి ఆశాజనక మాటలతో ప్రజలను నమ్మబలికి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మి ఎవరూ మోసపోవద్దని హెచ్చరించారు. ఇటీవల కొందరు ఫేక్ డాక్యుమెంట్లు, నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించి స్థలాలు, ఇళ్లు అమ్ముతున్నట్లు నటిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు.



ఆస్తుల కొనుగోలు సమయంలో సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించి, అధికారిక ధృవీకరణ తీసుకున్న తర్వాతే లావాదేవీలు చేయాలని సూచించారు. అలాగే సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని డబ్బులు అడగడం, ఫేక్ అకౌంట్లతో మోసాలు చేయడం, QR కోడ్ స్కాన్ చేయమని చెప్పి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. అపరిచితులపై నమ్మకం ఉంచి ఆర్థిక లావాదేవీలు చేయవద్దని సూచించారు. విద్యార్థులు, యువత ఉద్యోగాల కోసం ప్రయత్నించే సమయంలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న సంస్థలను మాత్రమే సంప్రదించాలని, ముందస్తుగా డబ్బులు అడిగే సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. మహిళలు బంగారం, చిట్‌ఫండ్స్, ఆన్‌లైన్ షాపింగ్ వంటి విషయాల్లో ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలు ఎవరైనా మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. చీటింగ్ కేసులపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని, మోసగాళ్లను చట్ట పరంగా శిక్షిస్తామని తెలిపారు. ప్రజల అప్రమత్తతే మోసాలకు అడ్డుకట్ట వేయ గలదు. అనుమానం వచ్చిన వెంటనే పోలీసులను సంప్రదించాలి అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.




# పట్టభద్రుల ఓటు నమోదు 100 శాతం కావాలి: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

- **యువత ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఓటు హక్కును వినియోగించుకోవాలి**

**వనపర్తి రూరల్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత కీలక పాత్ర పోషించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పలు వ్యాపార సముదాయాలను సందర్శించి, అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. బజాజ్ ఎలక్ట్రానిక్స్, కాసం ఆన్‌లైన్ లిమిటెడ్, గరుడ, ట్రెండ్స్, చందన బ్రదర్స్, బి-ఫిట్ రెడీమేడ్ తదితర సంస్థల్లో పనిచేస్తున్న పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు ఫారాలను అందజేశారు. దరఖాస్తు విధానం, సమర్పించాల్సిన ధ్రువపత్రాల గురించి వివరించారు.



**ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ...** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇప్పటివరకు కేవలం 36 శాతం మంది మాత్రమే ఓటరుగా నమోదు చేసుకోవడం ఆందోళనకరమన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవడం బాధ్యతగా గుర్తించాలని సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదు 100 శాతం పూర్తయ్యేలా యువతలో చైతన్యం తీసుకురావాలని కోరారు. ప్రైవేటు సంస్థలు, వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్న పట్టభద్రులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి యువత చురుకుగా పాల్గొనాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.



మాజీ మంత్రి స్వయంగా తమ వద్దకు వచ్చి అవగాహన కల్పించడంపై యువత హర్షం వ్యక్తం చేసింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, గంధం పరంజ్యోతి, మాణిక్యం, ఉంగ్లం తిరుమల్, నాగన్న యాదవ్, గులాం ఖాదర్ ఖాన్, నీలస్వామి, జోహెబ్ హుస్సేన్, ఇమ్రాన్, సయ్యద్ జమీల్, మాధవ్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భవాని మందిరంలో కుంకుమార్చన

**సదాశివపేట, అక్టోబర్ 25 (జనంసాక్షి):** పట్టణంలోని హట్కరిపేట శ్రీ భవాని మందిరంలో ఆదివారం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వాడోని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం హారతి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్ శంకర్‌గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ, భవసార క్షత్రియ సమాజ్ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.





## హట్కరిపేటలో వైభవంగా భవానీమాత నవరాత్రి ముగింపు వేడుకలు

- **ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పులిమామిడి రాజు**

**సంగారెడ్డి, అక్టోబర్ 25 (జనంసాక్షి):** సదాశివపేట పట్టణంలోని హట్కరిపేటలో భవసార్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో భవానీమాత నవరాత్రుల ముగింపు సందర్భంగా మహా పూర్ణిమను పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తుల్జాపూర్‌లో అనుసరించే పూజా సంప్రదాయం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి మేలుకొలుపు, ప్రత్యేక అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంగారెడ్డి శాసనసభ నియోజకవర్గ పోటీ అభ్యర్థి పులిమామిడి రాజు, సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి వాహనాన్ని అందంగా అలంకరించి, భజనలు, మేళతాళాల నడుమ పట్టణ పురవీధుల గుండా వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోపూరి శంకర్ గౌడ్, విజయ్, భవసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు వాడోని చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు రమేష్, అర్జున్, గవర్ధన్ రావు, త్రియాంబక్, తులసీదాస్, హరి, ఎం. విజయ్‌తో పాటు సమాజ్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలానగర్ మండల వార్డు మెంబర్ల ఫోరమ్ అధ్యక్షుడిగా రవీందర్ నాయక్ ఏకగ్రీవ ఎన్నిక!



**బాలానగర్, అక్టోబర్ 25(జనంసాక్షి):** బాలానగర్, తెలంగాణ వార్డు మెంబర్ల ఫోరమ్ ఆధ్వర్యంలో బాలానగర్ మండల వార్డు మెంబర్ల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాలానగర్ మండల అధ్యక్షుడిగా చింతకుంట తండాకు చెందిన చింతకుంట రవీందర్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ జిల్లా వార్డు మెంబర్ల ఫోరమ్ ఇన్‌చార్జి చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, గౌరవ అధ్యక్షులు కె. మనోహర్ రెడ్డి, జావీద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కమిటీలో అధ్యక్షులుగా చింతకుంట రవీందర్ నాయక్, ఉపాధ్యక్షులుగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, రాజు, కోశాధికారిగా జావీద్, సలహాదారుగా కొత్తపల్లి మధు వ్యవహరించనున్నారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రవీందర్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బాలానగర్ మండలంలోని వార్డు మెంబర్ల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో వార్డు మెంబర్లు సమష్టిగా పనిచేసేలా ఫోరమ్‌ను బలోపేతం చేస్తామని తెలిపారు. సలహాదారు కొత్తపల్లి మధు మాట్లాడుతూ వార్డు మెంబర్లు ఐకమత్యంతో ముందుకు సాగుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. నూతన అధ్యక్షుడు రవీందర్ నాయక్ నాయకత్వంలో బాలానగర్ మండల వార్డు మెంబర్ల ఫోరమ్ మరింత బలోపేతం కావాలని ఆయన శభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బాలానగర్ మండలంలోని పలువురు వార్డు మెంబర్లు, ఫోరమ్ నాయకులు పాల్గొన్నారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## నామకరణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**నిజాంపేట్, అక్టోబర్ 25(జనంసాక్షి):** నిజాంపేట్ మండలం నాగ్ధర్ గ్రామానికి చెందిన నారాయణ సేట్ మనవరాలి నామకరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

## మన గుడి... మన బాధ్యత...

- కలిసి కట్టుగా శ్రమదానం చేసి
- శభాష్ అనిపించుకున్న బిఅర్ఎస్ నాయకులు





**మార్కుక్, (జనంసాక్షి):** మన ఊరు మన గుడి మన బాధ్యత అనే లక్ష్యంతో ఆదివారం గ్రామ మాజీ సర్పంచ్ అప్పల ప్రవీణ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు శ్రమదానం చేసి శభాష్ అనిపించుకున్నారు. మార్కుక్ మండలం వరదరాజపూర్ గ్రామంలో పురాతన ఆలయం వరదరాజ స్వామి ఆలయం ఉంది. కాగా ఆలయం ఆవరణలో పిచ్చి మొక్కలు పొదలు ఉన్నాయి. ఆదివారం మాజీ సర్పంచి ప్రవీణ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులంతా కలిసి ఆలయం ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రంగా తయారు చేశారు. ఈ సందర్భంగా అప్పల ప్రవీణ్ మాట్లాడుతూ మన ఊరు మన గుడి మన బాధ్యత అనే లక్ష్యంతో శ్రమదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రెండో కంచిగా పేరుగాంచిన వరదరా స్వామి ఆలయం మాజీ సీఎం కేసీఆర్ హయాంలో పునర్నిర్మాణానికి నోచుకోవడం జరిగిందన్నారు. కోట్ల రూపాయలతో ఆలయాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే పూర్తి చేయాలని కోరారు. అయితే గుడి ఆవరణ చుట్టు ముళ్ల పొదలు పిచ్చి గడ్డి ఉండడం వల్ల స్థానిక బిఅర్ఎస్ నాయకులంతా కలిసి శ్రమదానం చేశామని తెలిపారు.

## యాదవ సంఘం అధ్యక్షుడికి ఘన సన్మానం



**బెజ్జంకి, అక్టోబర్ 25(జనంసాక్షి):** బెజ్జంకి మండల యాదవ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నలువాల స్వామిని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల యాదవ సంఘాల నూతన కమిటీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులను శాలువాలతో సత్కరించారు. యాదవ సంఘం ఐక్యతను బలోపేతం చేస్తూ సామాజిక అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పలువురు నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

## పుట్టు చీర, పుట్టు పంచె వేడుకకు హాజరైన మాజీ మంత్రి



**వనపర్తి రూరల్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** వనపర్తి మండలం అంకూర్ గ్రామ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి కుటుంబంలో నిర్వహించిన పుట్టు చీర, పుట్టు పంచె వేడుకకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు యశ్విత, మాణిక్ రెడ్డిలకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కే. మాణిక్యం, రఘువర్ధన్ రెడ్డి, మాధవరెడ్డి, డేగ మహేశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, చిట్యాల రాము, బంధుమిత్రులు పాల్గొన్నారు

## మృతదేహాల సంరక్షణపై వస్తున్న వార్తలు అవాస్తవం

- సూపరింటెండెంట్ డా.అర్షద్ ఉల్లా



**జడ్చర్ల, అక్టోబర్ 25 (జనంసాక్షి):** జడ్చర్ల ఏరియా ఆసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహణపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మొహమ్మద్ అర్షద్ ఉల్లా స్పష్టం చేశారు. ఆదివారం ఆయన విడుదల చేసిన వీడియో ప్రకటన ద్వారా ఘటనపై పూర్తి వివరాలు వెల్లడించారు. శుక్రవారం లక్ష్మమ్మ మృతదేహాన్ని ఆసుపత్రికి తీసుకొచ్చారని, అప్పటికే ఐదు ఆరు రోజులు కావడంతో బాడీ పూర్తిగా కుళ్ళిపోయి పురుగులు పట్టిన స్థితిలో ఉందని తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని తెచ్చిన సమయంలో బంధువులు సహజ మరణమని, ఎవరిపై అనుమానం లేదని లిఖితపూర్వకంగా తెలపడంతో ఆ రోజు పోస్టుమార్టం సాధ్యపడలేదు. దీంతో మృతదేహాన్ని మార్చురీ ఫ్రీజర్‌లో భద్రపరిచామని చెప్పారు. అదే రోజు సాయంత్రం డ్రౌనింగ్ కేస్‌కు చెందిన శ్రీరాములు మృతదేహాన్ని కూడా తీసుకురాగా, అప్పటికే ఉబ్బిపోయి ఉండటంతో పాటు సాయంత్రం కావడంతో మరుసటి రోజు పోస్టుమార్టం కొరకు ఫ్రీజర్‌లో ఉంచామన్నారు. లక్ష్మమ్మ మృతదేహానికి ఐదు రోజుల ముందే మృతి చెందడం వల్ల పురుగులు పట్టాయని, ఆసుపత్రిలో ఎలాంటి ఇన్ఫెక్షన్ కాలేదని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో స్వల్ప అంతరాయం వల్ల ఫ్రీజర్ ఉష్ణోగ్రత కొద్దిగా మారినా, దాని కెపాసిటీ ప్రకారం టెంపరేచర్ నియంత్రించబడిందని తెలిపారు. శనివారం పోలీస్ (విచారణ) పంచనామా పూర్తి కాగానే రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదని, వస్తున్న వార్తలు అవాస్తవమని తెలిపారు.

## జాషువాకు రజత పతకం



**గద్వాల, అక్టోబర్ 25 (జనంసాక్షి):** గద్వాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన అథ్లెట్ జాషువా ఢిల్లీలో నిర్వహించిన అంతర్రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-19 రన్నింగ్ విభాగంలో రజత పతకం సాధించాడు. తెలంగాణకు, గద్వాల ప్రాంతానికి కీర్తి తెచ్చిన జాషువాను స్వగ్రామంలో గ్రామస్థులు, యువత ఘనంగా సన్మానించారు. జాషువా పట్టుదల, కృషి యువతకు ఆదర్శమని గ్రామ పెద్దలు కొనియాడారు.

తన విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, కోచ్‌లకు జాషువా కృతజ్ఞతలు తెలిపాడు. భవిష్యత్తులో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి బంగారు పతకం సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

## మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనం



**వీపనగండ్ల, అక్టోబర్ 25(జనంసాక్షి):** వీపనగండ్ల మండల కేంద్రం లోని అంబేద్కర్ భవనంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ ఆత్మీయ సమావేశంలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెస్ ఎఫ్ జిల్లా ఇన్చార్జ్ పరశురాం హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఏబిసిడి రిజర్వేషన్లపై గత 35 సంవత్సరాలుగా పోరాటం నిర్వహిస్తూ రిజర్వేషన్లు సాధించామని, విద్యార్థులు రిజర్వేషన్లు ఉపయోగించుకుంటూ విద్యారంగంలో క్రమశిక్షణతో మెలుగుతూ విజయం సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ మాదిగ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో దయపు తేజ, చిల్డ్రన్స్ నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్థల దాతలను సన్మానించిన ఎమ్మెల్యే



**రేవల్లీ, అక్టోబర్ 25 (జనంసాక్షి):** రేవల్లి మండల కేంద్రంలో మహిళా సమైక్య భవనాన్ని నిర్మించడానికి స్థలాన్ని గ్రామానికి ఇచ్చిన దాతలు జిల్లా రవీందర్ రెడ్డి, గోవు ధర్మారెడ్డి, లోకా రెడ్డిలను ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రశంసలతో అభినందనలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజయ్య, పార్టీ నాయకులు బాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుర్నాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు చిన్నారెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం



**వెల్దండ, అక్టోబర్ 25 (జనంసాక్షి):** వెల్దండ మండలం బొల్లంపల్లి గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు కొమ్ము రమేష్‌ను మాజీ ఎంపీపీ పకాడి జయప్రకాష్ ఆదివారం పరామర్శించి, తక్షణ ఖర్చుల కోసం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఆపదలో ఉన్న బాధితులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణారెడ్డి, నరసింహ, సత్తూరి శేఖర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సమితి ఎన్నిక



**గద్వాల, అక్టోబర్ 25 (జనంసాక్షి):** రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా ధరూర్ పార్చర్లకు చెందిన సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పరమేశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సోదరులు వారిని ఘనంగా సత్కరించారు. సామాజిక వర్గంలో వెనుకబడిన వారిని ఆదుకునేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో నిరుపేద రెడ్డి కుటుంబాలను గుర్తించి, వారి పిల్లల చదువులకు అవసరమైన ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. ఉపాధి లేని యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి, స్వయం ఉపాధి పొందేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న రెడ్డి సామాజిక వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కేవలం సేవా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, సామాజిక ఐక్యతను పెంపొందించేందుకు గ్రామ గ్రామాన కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సమాజంలోని పెద్దల సలహాలు, సూచనలతో సమితిని మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. తమ పదవీ కాలంలో ఆదర్శవంతమైన సేవలందించి, సంఘ కీర్తిని పెంపొందిస్తామని నూతన కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## గర్వంతో మాట్లాడితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారు

- **మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విమర్శలు**



**వనపర్తి బ్యూరో అక్టోబర్ 25 (జనంసాక్షి):** వయసుకు తగ్గట్టుగా, హుందాగా మాట్లాడాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి సూచించారు. అహంకారపూరిత పాలన తమకు వద్దని, ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకే ప్రజలు గత ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజల తీర్పును గౌరవించకుండా ఇప్పటికీ అదే ధోరణితో మాట్లాడటం సరికాదన్నారు.

ఆదివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో ఓటమి పాలైన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని మేఘారెడ్డి విమర్శించారు. వయసులో పెద్దవారైన నాయకులు తమ మాటతీరు, ప్రవర్తనలో హుందాతనం పాటించాలని హితవు పలికారు. వెయ్యి మందితో వస్తే తాము 50 వేల మందితో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాఖ్యానించారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలనలో వనపర్తి నియోజకవర్గం అభివృద్ధి పేరుతో నష్టపోయిందని మేఘారెడ్డి ఆరోపించారు.

32 మంది బీసీ నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయించారని, విలేకరులపై సైతం అట్రాసిటీ కేసులు పెట్టిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నిరుద్యోగులు, ఇతర వర్గాల ప్రజలు గత పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పోస్టులకు ధరలు నిర్ణయించి కమిషన్లు వసూలు చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయని తెలిపారు.గత పాలనలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకునే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని మేఘారెడ్డి అన్నారు. తనను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజల తీర్పును నిరంజన్‌రెడ్డి గౌరవించాలని సూచించారు. నాగర్‌కర్నూల్‌లో పుట్టి, కొల్లాపూర్‌లో పెరిగిన తాను వనపర్తిలో రాజకీయ ఆధిపత్యం చెలాయిస్తాననంటే కుదరదని నిరంజన్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలన, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల సమక్షంలో చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మేఘారెడ్డి సవాల్ విసిరారు. గత ప్రభుత్వ పాలనకు సంబంధించిన పత్రాలతో నిరంజన్‌రెడ్డి చర్చకు రావాలని, తాను ఎలాంటి పత్రాలు లేకుండానే చర్చించేందుకు సిద్ధమని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో ఎవరి పాలన ఎలా ఉందో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు.వెయ్యి మందితో కలిసి నడిబజారులో చెప్పుతో కొడతానంటూ మాట్లాడటం ఏ విధమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో బెదిరింపులకు, వ్యక్తిగత దూషణలకు తావుండకూడదన్నారు. వనపర్తి ప్రజలు విద్యావంతులు, విజ్ఞులు, మేధావులని, రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని తెలిపారు. అహంకారంతో వ్యవహరించే నాయకత్వం కావాలా, ప్రజలకు సేవ చేసే నాయకత్వం కావాలా అన్నది ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు.వచ్చే ఎన్నికల్లో నిరంజన్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ వస్తుందో లేదో కూడా అనుమానమేనని మేఘారెడ్డి వ్యాఖ్యానించారు. ఒకవేళ టికెట్ వచ్చినా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. వనపర్తి రాజకీయాల్లో బెదిరింపులు, వ్యక్తిగత విమర్శల కంటే అభివృద్ధి, ప్రజాసేవకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహమే ఆత్మనిర్భర్ భారత్‌కు బాట!

- **చిట్యాలలో మన్‌కీ బాత్ 139వ ఎపిసోడ్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు**

**వనపర్తి, అక్టోబర్ 25 (జనంసాక్షి):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతినెల చివరి ఆదివారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసారం చేసే 'మన్ కీ బాత్' 139వ ఎపిసోడ్‌ను చిట్యాల శక్తి కేంద్రంలోని 105వ పోలింగ్ బూత్ పరిధిలో మండల ఉపాధ్యక్షుడు కాటమోని శ్రీనివాస్ గౌడ్ నివాసంలో బీజేపీ నాయకులు వీక్షించారు. 2014 విజయదశమి రోజున ప్రారంభమైన మన్ కీ బాత్ కార్యక్రమం దాదాపు 12 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధి, స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం, ఆరోగ్య రంగంలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై ఆయన సందేశాన్ని అందించారు.

పండుగల సమయంలో ప్రజలు స్థానికంగా తయారైన వస్తువులను కొనుగోలు చేయాలని, తద్వారా దేశీయ కళాకారులు, నేత కార్మికులు, ఖాదీ ఉత్పత్తిదారులకు అండగా నిలవాలని ప్రధాని పిలుపునిచ్చారు. స్వదేశీ ఉత్పత్తుల వినియోగం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. బీహార్‌కు చెందిన మఖానా ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు చేరుకోవడం పట్ల హర్షం



వ్యక్తం చేశారు.

అలాగే కేంద్ర ప్రభుత్వ ఇ-సంజీవని డిజిటల్ వైద్య సేవల ద్వారా కోట్లాది మంది ప్రజలకు ఆన్‌లైన్ వైద్య సలహాలు అందుతున్నాయని వివరించారు. ఐఐటీ మద్రాస్‌లో జరుగుతున్న మెదడు సంబంధిత పరిశోధనలు, సాంకేతిక స్టార్టప్‌ల పురోగతిని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సభిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా నాయకులు చెన్నయ్య, మండల ఉపాధ్యక్షుడు కాటమోని శ్రీనివాస్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సిరియాల శ్రీనివాసులు, బూత్ కమిటీ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్, యువ నాయకుడు మండ్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి

- **విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన**



**సంగారెడ్డి, అక్టోబర్ 25 (జనంసాక్షి):** జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులు,



ఆన్‌లైన్ షాపింగ్, పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులను తెరవవద్దని, రహస్య సంకేతాలు, బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

## శక్తిపీఠంలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**శివ్వంపేట, అక్టోబర్ 25 (జనంసాక్షి):** లోక కళ్యాణార్థం అమ్మవారి ఉపాసకులు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అష్టోత్తరశత (108) కుండాత్మక మహా యజ్ఞం ఆదివారం మండల కేంద్రమైన శివంపేట భగలాముఖి శక్తిపీఠంలో ఘనంగా నిర్వహించారు.

ఈ శక్తిపీఠం ప్రాంగణంలో 216 జంటలు యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బగలాముఖీ అమ్మవారికి విశేషంగా పసుపుతో హరిద్రార్చన నిర్వహించడంతో పాటు రుద్రయామల, శ్రీసూక్తం, దేవీ సూక్తం, బగలాముఖీ అష్టోత్తర నామార్చనలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలను వైభవంగా చేపట్టారు. ఈ మహా యాగానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్త, మాజీ ఎంపీపీ కల్లూరి హరి కృష్ణ,



జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం శివకుమార్ గౌడ్, పబ్బా రమేష్ గుప్తా, నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, సీఐ వెంకటరాజాగౌడ్ దంపతులు, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్, ఉపసర్పంచ్ మల్లేష్ తదితరులు భగలాముఖి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యే క పూజలు నిర్వహించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దుచేయాలి

**గద్వాల, అక్టోబర్ 25 (జనంసాక్షి):** ఓటర్ల అక్రమ తొలగింపును నిరసిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం గద్వాలలోని అనంత ఫంక్షన్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఓట్ బచావో- దేశ్ బచావో' అని పిలుపునిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. అక్రమంగా తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను వెంటనే తిరిగి నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అధికార పార్టీ అండతోనే అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశీలన లేకుండా, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే వేలాది మంది ఓట్లను తొలగించారని ఆరోపించారు. అర్హులైన పేదలు, సామాన్య ప్రజల ఓటు హక్కును కాలరాయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంత



మైన ఆయుధమని, దానిని నిర్వీర్యం చేసే కుట్రలను సహించేది లేదని హెచ్చరించారు. ఈ అక్రమాలపై తాము న్యాయపోరాటం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరపాలని కోరారు. అర్హులందరికీ తిరిగి ఓటు హక్కు కల్పించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు భద్రతపై అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ప్రజాస్వామ్య అస్తిత్వమే ఓటు హక్కు: వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి

- ఓటు చోరీతో ప్రజాస్వామ్యానికి ముప్పు..
- ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోంది




**వనపర్తి బ్యూరో అక్టోబర్ 25 (జనంసాక్షి):** ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే పునాది అని, ప్రతి ఓటును కాపాడుకోవడం దేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడంతో సమానమని వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి అన్నారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారంటూ కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నినాదంతో పోరాటం సాగిస్తోందని స్పష్టం చేశారు. ఆదివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శివసేన రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ నేత, ఉమ్మడి జిల్లాల 'ఓట్ బచావో.. దేశ్ బచావో' కార్యక్రమ పరిశీలకుడు రవీంద్రదాస్, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్దేశ్వర్, నియోజకవర్గ ఎస్ఐఆర్ ప్రక్రియ కోఆర్డినేటర్ శత్రుబుజ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటరే కీలకమని, ప్రజల చేతిలో ఉన్న ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలను సహించబోమని అన్నారు. ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా వ్యవహరించాల్సింది పోయి, బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల పేర్ల తొలగింపుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటు చోరీ అంశంపై ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇప్పటికే ప్రజెంటేషన్ ద్వారా దేశ ప్రజలకు వివరాలు వెల్లడించారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాలంటే ఓటు హక్కును పరిరక్షించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న మహాధర్నాలో వనపర్తి జిల్లా నుంచి 300 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని వెల్లడించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం...**

ఏఐసీసీ నేత రవీంద్రదాస్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కుల్లో ఓటు హక్కు అత్యంత కీలకమైందని అన్నారు. ప్రజల ఓట్లతో ఏర్పడిన ప్రభుత్వాలు అదే ఓటు హక్కును దెబ్బతీసేలా వ్యవహరిస్తే ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఓటు హక్కును కాలరాసే ప్రయత్నాలు జరిగితే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, ఓటు హక్కును కాపాడుకునే ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, బి.కృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, వివిధ మండలాల అధ్యక్షులు, జిల్లా, మండల కమిటీ సభ్యులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా .. పల్లకీ సేవా



**పాపన్నపేట, అక్టోబర్ 26 (జనంసాక్షి):** మంగళ హారతులు వన దుర్గమ్మ నామస్మరణ, భక్తి వాయిద్యాలతో వనంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. పౌర్ణమి సందర్భంగా మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా క్షేత్రంలో ఆదివారం వైభవంగా పల్లకీ సేవా నిర్వహించారు. సుందరంగా పూలతో అలంకరించిన పల్లకీలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించారు. అర్చకులు శంకర శర్మ అమ్మవారికీ ప్రత్యేక పూజలు చేశారు. రాజగోపురం, శివాలయం ముందుగా ఈపల్లకీ ఊరేగింపు కొనసాగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వీరేశం తదితరులు ఉన్నారు.

## పెద్దాపూర్ గ్రామంలో ఉత్సాహంగా క్రికెట్ మ్యాచ్



**కొత్తపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి):** కొత్తపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో క్రికెట్ మ్యాచ్ ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతూ ఆటలో చురుగ్గా పాల్గొన్నారు. క్రికెట్ మ్యాచ్‌తో గ్రామంలో క్రీడా సందడి నెలకొంది. పెద్దాపూర్ గ్రామం వాళ్లపై గొద్యల వారు విజయం సాధించారు ఫస్ట్ ప్రైస్ సెకండ్ ప్రైజ్ వింజమూరు వారిపై పెద్దపురం వారు విజయం సాధించారు ఈ క్రీడకు గిఫ్టుగా అల్లిపురం రమేష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు విరాళంగా 30 వేల రూపాయలు అందజేశారు అదేవిధంగా బూనిడు మహేందర్ రెడ్డి 5000 రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీలర్ కృష్ణయ్య ఎస్ కృష్ణారెడ్డి ఎండి అజీమ్యా ఎస్ సత్తిరెడ్డి, చెన్నారెడ్డి మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. క్రీడలు యువతలో శరీరాక దృఢత్వాన్ని క్రమశిక్షణను జట్టుగా కలిసి పని చేసే వృత్తిని పెంపొందిస్తుందని పలువురు పేర్కొన్నారు గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడ పోటీల నిర్వహణ యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచుతుందని తెలిపారు.

## పారిశుద్ధ్య కార్మికుడికి గోలి శ్రీనివాస్ రెడ్డి పరామర్శ



**వెల్దండ, అక్టోబర్ 25 (జనంసాక్షి):** బొల్లంపల్లి గ్రామపంచాయతీ లీలమ్మ బండ తండాలో ఇటీవల విధులు నిర్వహిస్తూ విద్యుత్ షాక్‌కు గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బొల్లంపల్లి గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు కొమ్ము రమేష్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. తదుపరి వైద్య ఖర్చులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పుట్టా రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ ఉప్పు అపర్ణ తిరుమలరావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు గుండ్లపల్లి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెన్నచెడ్‌లో లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం



**గండీడ్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** గండీడ్ మండలం వెన్నచెడ్ గ్రామంలో కొంతకాలంగా నెలకొన్న లోవోల్టేజ్ సమస్య పరిష్కా రానికి సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఎ

గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పుష్పలత గోపాల్, పులిందర్ రెడ్డి, రాములు గౌడ్, షేక్ అలీసార్, గండీడ్ చెన్నయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ మందిర నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళం



**సిర్గాపూర్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండలం సుల్తానాబాద్ గ్రామంలోని శ్రీ హనుమాన్ మందిర నిర్మాణానికి జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గుబ్బపు మచ్చేందర్ రూ.1.50 లక్షల విరాళం అందించారు. ఆలయాన్ని దర్శించుకున్న ఆయన నిర్మాణ పనులకు తన వంతు సహకారంగా విరాళాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ మచ్చేందర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా సాగర సంఘం గౌరవ అధ్యక్షుడు, కిష్టాపూర్ మాజీ ఎంపీటీసీ అంజయ్య సాగర్, మాజీ సర్పంచులు కిష్టారెడ్డి, నర్సింలు, సర్పంచ్ శామ్ ప్రసాద్, ఉపసర్పంచ్ భూషణం, మహేందర్ పటేల్, భూమయ్య, పండరి పటేల్, బాబు స్వామి, చాకలి హన్మండ్లు, శంకరయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రహదారి పక్కన మాంసం దుకాణాల్లో మందు సిట్టింగ్‌లపై పోలీసుల తనిఖీలు



**మల్దకల్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** మండల కేంద్రంలో రహదారి పక్కన ఉన్న మాంసం దుకాణాల్లో మందు సిట్టింగ్‌లపై పోలీసులు ఆదివారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మల్దకల్ పోలీస్ సిబ్బంది మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంబడి ఉన్న చికెన్, మటన్ దుకాణాలను, వాటి అనుబంధ గదులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల ప్రాంగణంలో కస్టమర్లకు మద్యం సేవించేందుకు స్థలం కేటాయించకూడదని నిర్వాహకులకు స్పష్టం చేశారు. రహదారుల పక్కన మద్యం సేవించడం వల్ల దారిపొడవునా వెళ్లే ప్రయాణికులకు, ముఖ్యంగా మహిళలకు ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నిబంధనలు మీరి చట్టవిరుద్ధంగా మద్యం సిట్టింగ్‌లు ఏర్పాటు చేసే దుకాణదారులపై, అక్కడ మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా హోటలలో సిట్టింగులు నిర్వహించిహోటల్ నడుపుతున్నారు. బిజ్వారం అమరవాయి, పాల్వాయి, ఎల్కూరు, అడవి రావులచెరువు, నేతువానిపల్లి, పెద్దపల్లి, మద్దెలబండ, తాటికుంట తదితర గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహించి సిట్టింగులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

## జడ్చర్ల బ్రాహ్మణ శంఖారావానికి కదిలిన మక్తల్ బ్రాహ్మణ సమూహం

- బ్రాహ్మణుల ఆత్మగౌరవం, హక్కుల సాధనే ధ్యేయంగా మహాసభ
- మక్తల్ నుంచి 10 వాహనాల్లో 100 మందికి పైగా ప్రతినిధుల తరలింపు



**మక్తల్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** సమాజంలో బ్రాహ్మణుల ఆత్మగౌరవం, హక్కుల సాధన సమైక్యతను చాటిచెప్పే లక్ష్యంతో జడ్చర్ల వేదికగా నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా బ్రాహ్మణ శంఖారావం మహాసభకు మక్తల్ నియోజకవర్గం నుంచి బ్రాహ్మణ ప్రతినిధులు, ప్రముఖులు, మహిళలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా తరలివెళ్లారు. మక్తల్ పట్టణంలోని 13వ వార్డు కౌన్సిలర్ సరిత, గుర్జాల్ సురేంద్రాచారి, ఎస్. రమేష్ రావుల ఆధ్వర్యంలో వారి మార్గదర్శకత్వంలో సభకు సుమారు 100 మంది బ్రాహ్మణులు ప్రత్యేకంగా 10 వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఈ మహాసభ ద్వారా సమాజంలో బ్రాహ్మణుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, సంక్షేమం, అలాగే విద్యా-ఉపాధి రంగాలలో తగిన గుర్తింపు సాధించడమే ధ్యేయంగా మక్తల్ నియోజకవర్గ గళాన్ని బలంగా వినిపించడానికి అందరూ సంసిద్ధులై కదిలారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ సుందర్ జోషి, విద్వాన్ రాఘవేంద్ర చారి, ప్రాణేశాచారి, గోవిందరావు, రఘు ప్రసన్న భట్, మఠం వాదిరాజ్, హనుమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

## పట్టభద్రుల ఓటరు నమోదుకు బీఆర్ఎస్ కేంద్రం ప్రారంభం



**కీసర, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** ఉమ్మడి హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నాగారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకుల సమావేశం ఆదివారం శ్రీనివాస్‌నగర్ కాలనీలోని దర్గా వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ, అర్హులకు అవగాహన కల్పించే అంశాలపై చర్చించారు. అనంతరం 5, 17వ వార్డులకు కలిపి ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించి, కాలనీవాసులకు దరఖాస్తులు అందజేశారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో ఓటరు నమోదు చేసుకోవచ్చని, అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కౌకుట్ల అనంత్‌రెడ్డి, నాగారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, సీనియర్ నాయకులు అన్నంరాజు శ్రీనివాస్, కౌకుట్ల కృష్ణారెడ్డి, చిన్నంరాజు సాయినాథ్‌గౌడ్, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సెల్ టవర్ అనుమతులపై సమగ్ర పరిశీలన జరపాలి

## సామాజిక కార్యకర్త అక్కల సురేష్ కుమార్





**కీసర, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** నాగారం ప్రాంతంలో చేపడుతున్న సెల్ టవర్ నిర్మాణానికి సంబంధించి వర్తించే నిబంధనలు, అనుమతులపై మున్సిపల్ అధికారులు సమగ్రంగా పరిశీలించాలని సామాజిక కార్యకర్త అక్కల సురేష్ కుమార్ కోరారు. సెల్ టవర్ నిర్మాణానికి సంబంధించి తాము చేస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో, ఇందుస్ టవర్స్ సంస్థ జోనల్ కమిషనర్‌కు లేఖ సమర్పించినట్లు అక్కల సురేష్ కుమార్ ఆదివారం తెలిపారు. అయితే, ఆ లేఖ ఆధారంగా నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులపై నిర్ధారణకు రాకుండా, సంబంధిత రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని అధికారులను కోరారు. భవన నిర్మాణ అనుమతులు, సెల్లార్‌కు సంబంధించిన అనుమతులు, నిర్మాణ భద్రత, వర్తించే నిబంధనలపై సంబంధిత అధికారులు పరిశీలన జరపాలని సూచించారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు నిర్ధారణ అయితే, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై అధికారుల పరిశీలన పూర్తయ్యే వరకు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని కోరారు. సెల్ టవర్ నిర్మాణానికి సంబంధించి తమ విజ్ఞప్తికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలిపిన వారికి సామాజిక కార్యకర్త అక్కల సురేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# బీపీ, షుగర్‌పై అప్రమత్తత అవసరం : ముప్పా శ్రీనివాస్

## జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 134వ ఉచిత వైద్య శిబిరం

## 30 ఏళ్లు దాటినవారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి



**కీసర, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** బీపీ, షుగర్ వంటి జీవనశైలి వ్యాధులను ముందుగానే గుర్తిస్తే నియంత్రించడం సులభమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పా శ్రీనివాస్ అన్నారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక గత 134 నెలలుగా నిరంతరాయంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం చక్రిపురంలోని చక్రి విద్యానికేతన్ హైస్కూల్‌లో 134వ నెల ఉచిత బీపీ, షుగర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పా శ్రీనివాస్ మాట్లాడుతూ.. 30 ఏళ్లు దాటినవారు క్రమం తప్పకుండా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమతుల ఆహారం, వ్యాయామం, ఒత్తిడి లేని జీవనశైలి అలవర్చుకోవాలని సూచించారు. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడం, మూఢనమ్మకాలను తొలగించడం జనవిజ్ఞాన వేదిక లక్ష్యమన్నారు. జిల్లా కోశాధికారి జెన్నీ మాట్లాడుతూ.. పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు డాక్టర్లు విద్యాసాగర్, జయరాజ్, దేవిక, నవనీత, సంగీత నాయక్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు సిహెచ్ ప్రభాకర్, శేషగిరిరావు, నాగరాజు, రాజేశ్వరి, సోమయ్యచారి, ఎం.ఎల్ చౌదరి, శేషు, నర్సింగ్ రావు, తేజస్వి, శశిధర్ రెడ్డి, ఉదయ్ కుమార్ వాలంటీర్లు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాల్సిందే..

## 27 నుంచి పాదయాత్ర : ఈటల రాజేందర్ డిమాండ్

## శాశ్వత పరిష్కారానికి కేంద్రం నుంచి రూ.3 వేల కోట్ల నిధులు తెచ్చేందుకు సిద్ధం





**హైదరాబాద్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** జవహర్‌నగర్ డంపింగ్ యార్డు కాలుష్యం నుంచి ప్రజలకు విముక్తి కల్పించే వరకు పోరాటం ఆపేది లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం కోరుతూ ఈ నెల 27 నుంచి బాధితులతో కలిసి పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటిం చారు. అవసరమైతే కేంద్రం నుంచి రూ.2 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల వరకు నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో ఆదివారం ప్రొఫెసర్ మురళీ మనోహర్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈటల మాట్లాడారు. నగరంలోని చెత్తను ఒకేచోట వేయకుండా వివిధ ప్రాంతాల్లో ఆధునిక శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఇప్పటికే పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని డిమాండ్ చేశారు. చెత్తను సంపదగా మార్చే సాంకేతికత అందుబాటులో ఉన్నా సమస్యకు పరిష్కారం చూపకపోవడం పాలకుల వైఫల్యమని విమర్శించారు. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న కాలుష్యంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, పర్యావరణవేత్తలు పురుషోత్తం రెడ్డి, దొంతి నరసింహారెడ్డి, ప్రొఫెసర్ కృష్ణారెడ్డి తదితరులు మాట్లాడుతూ.. శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు అమలు చేయాలని సూచించారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎంఆర్‌పీఎస్ ప్రతినిధి తిప్పారపు లక్ష్మణ్ తదితరులు ఈటల పాదయాత్రకు మద్దతు ప్రకటించారు.

# పేకాట స్థావరంపై కీసర పోలీసుల దాడి

## ఐదుగురి అదుపులోకి.. రూ.35 వేల నగదు, వాహనాలు స్వాధీనం

**కీసర, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** తిమ్మాయిపల్లి పరిధిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి నిర్వహించినట్లు కీసర సీఐ ఎలక్షన్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.35 వేల నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్లు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

